# ఎస్ఆర్‌హెచ్ వాష్ ఔట్

**వర్షంతో మ్యాచ్ రద్దు ● ప్లేఆఫ్స్ రేసు నుంచి హైదరాబాద్ నిష్క్రమణ ● ప్యాట్ కమిన్స్ విజృంభణ ● ఢిల్లీ క్యాపిటల్స్ 133/7**



కమిన్స్ (3/19)



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్‌లో నిరుటి రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. గెలిస్తే కానీ రేసులో నిలువలేని పరిస్థితుల్లో హైదరాబాద్ ఆశలపై వరుణుడు నీళ్లు గుమ్మరించాడు. సోమవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దయ్యింది. దీంతో అంపైర్లు ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కారణంగా సన్‌రైజర్స్‌కు చుక్కెదురు కాగా, ఢిల్లీ 13 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నది. లీగ్‌లో ఇప్పటికే చెన్నై, రాజస్థాన్..ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలుగగా, తాజాగా హైదరాబాద్ ఈ జాబితాలో చేరింది. సన్‌రైజర్స్‌కు ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నా..ఆడిన 11 మ్యాచ్‌ల్లో ఏడింటిలో ఓడి, ఒక మ్యాచ్‌లో ఫలితం తేలకపోవడంతో ప్రస్తుతం 7 పాయింట్లతో 8వ స్థానంలో ఉన్నది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 133/7 స్కోరుకు పరిమితమైంది. కమిన్స్ (3/19) ధాటికి ఢిల్లీ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. స్టబ్స్ (41 నాటౌట్), అశుతోష్(41) మినహా ఎవరూ పెద్దగా రాణించలేదు. కమిన్స్ విజృంభణతో ఢిల్లీ టాపార్డర్ కకావికలమైంది. ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత హైదరాబాద్ బ్యాటింగ్ మొదలయ్యే సమయానికి వరుణుడు రంగప్రవేశం చేశాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురియడంతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. కవర్లతో మైదానాన్ని దాదాపు కప్పి ఉంచినా లాభం లేకపోయింది. మైదానంలో భారీగా నీరు చేరడం, మ్యాచ్‌కు సిద్ధం చేసేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నం సఫలం కాలేదు. పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు ఆటకు అనుకూలంగా లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్ల సమక్షంలో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అప్పటి వరకు స్టాండ్స్‌లో ఉన్న అభిమానులు నిరాశగా మైదానాన్ని వీడారు.

**కమిన్స్ కేక:**

తొలుత టాస్ గెలిచిన హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్..ఢిల్లీని బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలన్న పట్టుదలతో సన్‌రైజర్స్ ఈసారి పలుమార్పులతో బరిలోకి దిగింది. సీనియర్ స్పీడ్‌స్టర్ షమీతో పాటు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డిని పక్కకు పెట్టిన సన్‌రైజర్స్.. సచిన్ బేబితో పాటు ఇషాన్ మలింగను తుది జట్టులోకి తీసుకుంది. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతికే కరుణ్ నాయర్(0) వికెట్‌కీపర్ ఇషాన్‌కిషన్‌కు క్యాచ్ ఇచ్చి గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన డుప్లెసిస్(3) కూడా ఎక్కువ సేపు నిలదొక్కుకోలేకపోయాడు. ఈసారి కిషన్‌కు క్యాచ్ ఇచ్చిన డుప్లెసిస్..కమిన్స్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. అభిషేక్ పొరెల్(8) కూడా కరుణ్, డుప్లెసిస్‌ను అనుసరిస్తూ కమిన్స్ బౌలింగ్‌లో కిషన్ క్యాచ్‌తో మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఢిల్లీ 5వ ఓవర్లలోనే టాపార్డర్ వికెట్లు కోల్పోయింది. ఈ మూడు వికెట్లు కూడా కమిన్స్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ కిషన్ క్యాచ్‌లు పట్టడం విశేషం. భారీ ఆశలు పెట్టుకున్న రాహుల్(10), అక్షర్‌పటేల్(6), వెంటవెంటనే ఔట్ కావడంతో ఢిల్లీ 29 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో కనీసం 50 పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ స్టబ్స్, నిగమ్(18), అశుతోష్..హైదరాబాద్ బౌలర్లకు ఎదురొడ్డి నిలుస్తూ కీలక పరుగులు జతచేశారు. ముఖ్యంగా స్టబ్స్, అశుతోష్ క్రీజులో నిలదొక్కుకోవడం ఢిల్లీకి కలిసొచ్చింది. అన్సారీ 15వ ఓవర్‌లో అశుతోష్ రెండు భారీ సిక్స్‌లతో చెలరేగి ఇన్నింగ్స్‌కు ఊపిరి తీసుకురాగా, హర్షల్ 17వ ఓవర్‌లో మరో రెండు ఫోర్లు అరుసుకున్నాడు. ఇలా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టిన ఈ ఇద్దరు ఢిల్లీకి గౌరవప్రదమైన స్కోరు అందించారు. మలింగ ఆఖరి ఓవర్‌లో అశుతోష్ ఔట్ కావడంతో ఏడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. స్టబ్స్, అశుతోష్ ఆదుకోకపోతే ఢిల్లీ 100 పరుగుల లోపే కుప్పకూలేది.

### సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 133/7(స్టబ్స్ 41 నాటౌట్, అశుతోష్ 41, కమిన్స్ 3/19, ఉనద్కత్ 1/19)

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.48 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 1 | 15 | 0.37 |
| ముంబై | 11 | 7 | 4 | 0 | 14 | 1.27 |
| గుజరాత్ | 10 | 7 | 3 | 0 | 14 | 0.86 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 1 | 13 | 0.36 |
| కోల్‌కతా | 11 | 5 | 5 | 1 | 11 | 0.24 |
| లక్నో | 11 | 5 | 6 | 0 | 10 | -0.46 |
| హైదరాబాద్ X | 11 | 3 | 7 | 1 | 7 | -1.19 |
| రాజస్థాన్ X | 12 | 3 | 9 | 0 | 6 | -0.71 |
| చెన్నై X | 11 | 2 | 9 | 0 | 4 | -1.11 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ వేదికగా ఎల్‌వీఆర్ స్మారక బాస్కెట్‌బాల్ టోర్నీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన వివిధ మ్యాచ్‌ల్లో ప్లేయర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. వైఎమ్‌సీఏ హైదరాబాద్ 44-7తో వీపీజీపై ఘన విజయం సాధించింది. ఆది నుంచే తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన వైఎమ్‌సీఏ హైదరాబాద్ వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. వైఎమ్‌సీఏ సికింద్రాబాద్ 51-18తో జింఖానా గ్రౌండ్స్‌పై గెలిచింది. మిగతా మ్యాచ్‌ల్లో కీస్టోన్ 67-47తో వైఎమ్‌సీఏ హైదరాబాద్‌ను ఓడించింది. కీస్టోన్ తరపున సుభాశ్ (19), ఆర్యన్ (17) ఆకట్టుకున్నారు. రైజింగ్ స్టార్స్ 57-35తో వీపీజీపై భారీ విజయం సాధించింది. లోకేశ్ (17), నిపుణ్ (13) రైజింగ్ గెలుపులో కీలకమయ్యారు.



## మౌంట్ ఐసోపై యశ్వంత్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ మరోమారు సత్తాచాటాడు. ప్రపంచంలో ఎత్తైన పర్వతాలు అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకున్న యశ్వంత్ తాజాగా మణిపూర్‌లో అత్యంత ఎత్తయిన మౌంట్ ఐసోను ఎక్కాడు. 'హర్ శిఖర్ పర్ తిరంగ' మిషన్‌లో భాగంగా యశ్వంత్ ఆదివారం మౌంట్ ఐసో పైకి త్రివర్ణ పతాకంతో చేరుకున్నాడు. యశ్వంత్‌తో పాటు అసోం రైఫిల్స్ 16వ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు మిలటరీ అధికారులు ఈ పర్వతాన్ని అధిరోహించారు. గతంలో కిలీమంజారో, మౌంట్ ఎల్బ్రస్ పర్వతాలపై యశ్వంత్ అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.

## స్మరణ్ స్థానంలో దూబే



న్యూఢిల్లీ: గాయపడ్డ స్మరణ్ రవిచంద్రన్ స్థానంలో యువ ఆల్‌రౌండర్ హర్ష్ దూబేను సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ జట్టులోకి తీసుకుంది. దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపిన 22 ఏండ్ల దూబే కనీస ధర 30 లక్షలతో ఎస్‌ఆర్‌హెచ్‌లోకి వచ్చాడు. ఇటీవల ముగిసిన రంజీ టోర్నీలో విదర్భ తరపున బరిలోకి దిగిన దూబే 476 పరుగులకు తోడు 69 వికెట్లతో అదరగొట్టాడు. తన కెరీర్‌లో ఇప్పటి వరకు 16 టీ20లు, 20 లిస్ట్-ఏ, 18 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన దూబే 127 వికెట్లతో పాటు 941 పరుగులు చేశాడు. మరోవైపు గాయపడ్డ వన్ష్ బేడి స్థానంలో గుజరాత్ సంచలనం ఉర్విల్ పటేల్‌ను చెన్నై సూపర్‌కింగ్స్ తీసుకుంది. మోకాలి గాయంతో బేడి లీగ్‌కు దూరం కావడంతో సీఎస్‌కే..ఉర్విల్‌ను ఎంపిక చేసుకుంది. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో త్రిపురపై 28 బంతుల్లోనే ఉర్విల్ రికార్డు సెంచరీతో వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే.



## పర్వ్ చౌదరీకి కాంస్యం

లిమా(పెరూ): ఐడబ్ల్యూఎఫ్ యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ లిఫ్టర్ పర్వ్ చౌదరీ కాంస్య పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన బాలుర యూత్ 96కిలోల విభాగంలో బరిలోకి చౌదరీ.. స్నాచ్‌లో 140కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 175కిలోలు ఎత్తి మొత్తంగా 315కిలోలతో మూడో స్థానంలో నిలిచాడు. టోర్నీలో భారత్‌కు ఇది మూడో పతకం. ఇప్పటికే జోష్న సాబర్ (40కి), హర్షవర్ధన్ సాహు (49కి) కాంస్య పతకాలు సాధించిన సంగతి తెలిసిందే.

## సీసీఐ బిలియర్డ్స్ విజేత పంకజ్



ముంబై: భారత దిగ్గజ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఖాతాలో మరో టైటిల్ చేరింది. సీసీఐ బిలియర్డ్స్ క్లాసిక్ టోర్నీలో పంకజ్ వరుసగా మూడోసారి విజేతగా నిలిచాడు. సోమవారం జరిగిన ఫైనల్లో పంకజ్ 5-2తో ధృవ్ సిత్వాలపై అద్భుత విజయం సాధించాడు. తుది పోరులో ఆదిలో తడబడ్డ అద్వానీ.. ఆ తర్వాత పుంజుకుని పోటీలోకి వచ్చాడు. స్కోరు 2-2తో సమమైన సమయంలో వరుసగా మూడు ఫ్రేమ్‌లు గెలిచిన ఈ స్టార్ క్యూయిస్టు టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.


## మాడ్రిడ్ చాంప్ రూడ్



మాడ్రిడ్: మాడ్రిడ్ ఓపెన్‌లో నార్వే సంచలనం కాస్పర్ రూడ్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రూడ్ 7-5, 3-6, 6-4తో జాక్ డ్రేపర్‌పై అద్భుత విజయం సాధించాడు. తద్వారా మాస్టర్స్ 1000 టైటిల్ గెలిచిన తొలి నార్వే ప్లేయర్‌గా రూడ్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. తొలి సెట్‌ను 7-5తో కైవసం చేసుకున్న రూడ్‌కు రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి చుక్కెదురైంది. అయితే నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకున్న రూడ్ అద్భుతమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో మ్యాచ్‌ను తన వశం చేసుకున్నాడు.

## షమీకి బెదిరింపులు

**కోటి రూపాయల డిమాండ్‌తో మెయిల్**



న్యూఢిల్లీ: భారత సీనియర్ స్పీడ్‌స్టర్ మహమ్మద్ షమీకి బెదిరింపులు ఎదురయ్యాయి. ఇప్పటికే టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ గౌతం గంభీర్‌కు ఇదే తరహాలో బెదిరింపులు రాగా, తాజాగా షమీకి రాజ్‌పుత్ సింధార్ అనే వ్యక్తి మెయిల్ ద్వారా హెచ్చరికలు పంపాడు. కోటి రూపాయలు ఇవ్వకపోతే చంపేస్తామంటూ బెదిరింపులకు దిగాడు. వెంటనే అప్రమత్తమైన షమీ సోదరుడు మహమ్మద్ హసీబ్.. అమ్రోహా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు విజ్ఞప్తి చేశాడు. ఈ నెల 4వ తేదీన వచ్చిన మెయిల్‌పై అమ్రోహా పోలీసులు సైబర్ సెల్‌లో కేసు నమోదు చేసి, విచారణ మొదలుపెట్టారు. ప్రాథమిక దర్యాప్తులో కర్ణాటకకు చెందిన ప్రభాకర్ అని తెలిసింది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే తాజా ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడుతున్న షమీ అంతగా ఆకట్టుకోలేకపోయాడు.

# సినిమాపై ట్రంప్ టారిఫ్ వార్

**ప్రపంచ దేశాల ఉత్పత్తులపై సుంకాల విధింపుతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు వినోద రంగంపై కొరడా ఝళిపించారు. అమెరికా వెలుపల నిర్మాణం జరుపుకొని అక్కడ విడుదలయ్యే ఏ చిత్రానికైనా వందశాతం సుంకం విధించాలని యోచిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ సినీరంగంలో ప్రకంపనలు మొదలయ్యాయి. అమెరికా బాక్సాఫీస్‌లో తెలుగు సినిమాకు గణనీయమైన వాటా ఉంది. ట్రంప్ నిర్ణయంతో అక్కడి తెలుగు సినిమా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ మొత్తం కుదేలయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.**





### అమెరికా మార్కెట్‌లో 30 శాతం వాటా

తెలుగు సినిమా ఓవర్సీస్ రెవెన్యూలో 80 శాతానికిపైగా అమెరికా నుంచే వస్తున్నదని ట్రేడ్ వర్గాల అంచనా. బాహుబలి-2, ఆర్ఆర్ఆర్, పుష్ప-2 వంటి చిత్రాలు అక్కడ భారీ వసూళ్లను సాధించాయి. తెలుగు సినిమా గ్రాస్ కలెక్షన్స్‌లో అమెరికా నుంచి వచ్చే ఆదాయం 25-30 శాతం మేరకు ఉంటుందని చెబుతారు. ముఖ్యంగా అగ్ర హీరోల సినిమాల పట్ల అమెరికా డిస్ట్రిబ్యూటర్లు ఎక్కువ ఆసక్తిని ప్రదర్శిస్తారు. ట్రంప్ వందశాతం టారిఫ్ నిర్ణయంతో అక్కడ తెలుగు సినిమా పంపిణీ ఇక ఆర్థికంగా ఏమాత్రం లాభసాటి కాదనే మాటలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే భారతీయ చిత్రాలను కొనుగోలు చేసిన డిస్ట్రిబ్యూటర్లు ట్రంప్ తాజా నిర్ణయంతో ఆందోళనకు గురవుతున్నారు. డీల్ పూర్తి చేసుకున్న చిత్రాలు సుంకాలు కట్టాల్సి వస్తే డిస్ట్రిబ్యూటర్స్ ఆ నష్టాలను భరించలేరని ట్రేడ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సినిమా కంటెంట్ ప్రొడక్షన్‌లో ఇండియా గ్లోబల్ పవర్‌గా ఎదుగుతున్న తరుణంలో ట్రంప్ నిర్ణయంతో సినిమా వ్యాపార సమీకరణాలు మారిపోతాయని అంటున్నారు.

### హాలీవుడ్ సినిమాలపై తీవ్ర ప్రభావం

అమెరికా ప్రొడక్షన్ సంస్థలు బయట దేశాల్లో తమ సినిమాలను నిర్మించడం 'జాతీయ భద్రతకు' సంబంధించిన అంశమని ట్రంప్ తన ట్విట్టర్ స్టేట్‌మెంట్‌లో ఆరోపించారు. 'ఇతర దేశాలు అనేక ప్రోత్సాహకాలతో హాలీవుడ్ సినిమాను ఆకర్షిస్తున్నాయి. దాంతో ఇక్కడ సినిమా క్షీణదశకు చేరుకుంది. ఇది జాతి ప్రతిష్టకు సంబంధించిన అంశం. అందుకే వందశాతం సుంకాల విధించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్‌ను ఆదేశిస్తున్నా. అమెరికాలో మరలా సినీ నిర్మాణం పుంజుకోవాలన్నదే నా అభిమతం' అని ట్రంప్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం హాలీవుడ్ బడా నిర్మాణ సంస్థల పాలిట శరాఘాతంగా మారనుందని ట్రేడ్ వర్గాలంటున్నాయి. హాలీవుడ్‌లో పెద్ద నిర్మాణ సంస్థలైన మార్వెల్ స్టూడియోస్, వార్నర్ బ్రదర్స్ వంటి సంస్థలు ఎక్కువగా తమ చిత్రాలను లండన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో తెరకెక్కిస్తున్నాయి. మిషన్ ఇంపాజిబుల్-ది ఫైనల్ రెకానింగ్, అవెంజర్స్: డూమ్స్ డే, అవతార్-3 వంటి చిత్రాలు వివిధ దేశాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. ఇప్పుడు ఈ సినిమాలపై కూడా వందశాతం సుంకం విధిస్తారా? అసలు విదేశీ సినిమాను ఏ అంశాల ప్రాతిపదికన నిర్ణయిస్తారనే విషయంలో అనేక సందేహాలు నెలకొన్నాయి.

### అమెరికాలో డిస్ట్రిబ్యూషన్ ఇక కష్టమే..

ట్రంప్ నిర్ణయం వినాశకరమైన చర్య అని బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి అభిప్రాయపడ్డారు. వందశాతం సుంకాల టారిఫ్ అమలైతే అమెరికాలో పది డాలర్లకు లభించే టికెట్ 20 డాలర్లు అవుతుందని, అంత ధరతో అక్కడ ఎవరూ సినిమాలు చూడరని ఆయన అన్నారు. సీనియర్ దర్శకనిర్మాత ముఖేష్‌భట్ ట్రంప్ నిర్ణయాన్ని 'పెద్ద జోక్' అంటూ కొట్టిపడేశారు. ట్రంప్ వందశాతం సుంకాల విధింపు బ్యాక్‌ఫైర్ అవుతుందని, హాలీవుడ్ సినిమాకే అది ఎక్కువ నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. వందశాతం టారిఫ్ అమలు జరిగితే తెలుగు చిత్రాల డిస్ట్రిబ్యూషన్‌కు ఎవరూ ముందుకురారని, అమెరికాలో తెలుగు డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ మొత్తం కనుమరుగు అవుతుందని ట్రేడ్ నిపుణులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా పఠాన్, ఆర్ఆర్ఆర్, డంకీ, జవాన్, సలార్, కల్కి, పుష్ప-2 వంటి చిత్రాలు అమెరికాలో రికార్డు స్థాయిలో వసూళ్లను రాబట్టాయి. ఉత్తర అమెరికాలో తెలుగు సినిమాలకు విపరీతంగా క్రేజ్ ఉంటుంది. అక్కడ భారత్ కంటే ఒకరోజు ముందుగానే సినిమా విడుదల చేస్తారు. అక్కడ వచ్చే టాక్ ఇండియాలో బాక్సాఫీస్ వసూళ్లను పెంచేందుకు దోహదపడుతున్నది.

### ఓటీటీ మార్కెట్‌పై ప్రభావం?

ట్రంప్ తాజా నిర్ణయం థియేటర్ రిలీజ్ వరకేనా? లేకా ఓటీటీలకు కూడా వర్తిస్తుందా? అనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ఓటీటీ చిత్రాలకు కూడా సుంకాలను వర్తింపజేస్తే నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో వంటి పాపులర్ ఓటీటీ వేదికలు భారత్‌లో తమ పెట్టుబడులను తగ్గించుకుంటాయి. దాంతో నిర్మాతలకు డిజిటల్ రైట్స్ నుంచి వచ్చే లాభాలు తగ్గిపోతాయి. అయితే ట్రంప్ వందశాతం టారిఫ్‌పై ఇంకా అధికారికంగా ఎలాంటి నిర్ణయం జరగనందున కొద్దికాలం వేచిచూస్తే ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుందంటున్నారు.

## చిత్రం



## నిర్మాతగా నా లక్ష్యమదే!

అగ్ర కథానాయిక సమంత నిర్మాతగా మారిన విషయం తెలిసిందే. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. హర్షిత్ రెడ్డి, శ్రియా, శ్రావణి, షాలినీ, చరణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆదివారం విశాఖపట్నంలో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ కొత్త కథల్ని పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ బ్యానర్‌ను స్థాపించాను. వైజాగ్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ చేసిన ప్రతీ సినిమా హిట్ అయింది. వైజాగ్ అభిమానుల్ని చూసి నిజమైన ప్రేమ ఏంటో అర్థమైంది' అని చెప్పింది. తెలుగులో ఇప్పటివరకు ఇలాంటి హారర్ కామెడీ కథ రాలేదని, సమంత వల్లే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చిందని దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తెలిపారు. బుల్లితెరలో వచ్చే సీరియల్స్‌ని అందరూ తక్కువ చేసి మాట్లాడుతుంటారని, కానీ వాటిపై తనకు చాలా గౌరవం ఉందని, అదే పాయింట్‌ను ఈ సినిమాలో హారర్ ఫార్మెట్‌లో చూపించామని రచయిత వసంత్ మరిగంటి పేర్కొన్నారు. వినూత్న కథా చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉందని చిత్ర తారాగణం ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: క్లింటన్ సెరెజో.



**సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ఇటీవల కిమ్స్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీతేజ్ ట్రాక్స్‌కేర్ రిహాబిలిటేషన్ కేంద్ర పర్యవేక్షణలో ఉన్నాడు. శ్రీతేజ్‌ను సోమవారం ఉదయం అగ్ర నిర్మాత అల్లు అరవింద్, బన్నీ వాసు పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.**

## మత్స్యకారుల పోరాటం




నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్‌జార్జ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కైలాష్ దుర్గం నిర్మాత. సోమవారం ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు మ్యాగీ ఆవిష్కరించారు. మత్స్యకారుల నేపథ్యంలో వారి జీవన సంఘర్షణ, పోరాటాన్ని చూపిస్తూ టీజర్ ఆసక్తికరంగా సాగింది. మాస్ కథాంశంతో రూపొందించిన ఈ సినిమాలో కొంచెం తమిళ నేపథ్యం కూడా ఉంటుందని దర్శకుడు తెలిపారు. మత్స్యకారుల నేపథ్యంలో పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించామని నిర్మాత కైలాష్ దుర్గం పేర్కొన్నారు. జగదీష్ ప్రతాప్, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రజల్ క్రిష్, ఎం.ఎల్.రాజా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జోయెల్ జార్జ్.

## ద్విపాత్రాభినయంలో చిరంజీవి?



అగ్ర నటుడు చిరంజీవికి ద్విపాత్రాభినయం కొత్తేమి కాదు. ఇప్పటికే పలు చిత్రాల్లో ఆయన డ్యూయల్ రోల్‌లో మెప్పించారు. తాజా సమాచారం ప్రకారం అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రంలో చిరంజీవి మరోమారు ద్విపాత్రాభినయంలో కనిపించబోతున్నట్లు తెలిసింది. 'మెగా 157' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమాను ఉగాది సందర్భంగా లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నెల 22 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో చిరంజీవి డ్యూయల్ రోల్‌లో కనిపిస్తారని, ఆయన పాత్ర ఆద్యంతం చక్కటి హాస్యంతో సాగుతుందని చెబుతున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన శైలి సకుటుంబ వినోదప్రధానంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని, చిరంజీవి ఇమేజ్‌కి తగినట్లుగా హై ఇంటెన్సిటీ యాక్షన్ కూడా ఉంటుందని అంటున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

## వందశాతం నవ్వులు గ్యారంటీ



శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సింగిల్' ఈ నెల 9 ప్రేక్షకుల ముందుకురానుంది. గీతా ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకుడు. ఆద్యంతం వినోదాత్మకంగా ముక్కోణపు ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు కార్తీక్‌రాజు సినిమా విశేషాలను పంచుకున్నారు. ప్రేక్షకుల్ని రెండున్నర గంటల పాటు కడుపుబ్బా నవ్వించే చిత్రమిదని, వినోదంతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా మెప్పిస్తాయని చెప్పారు. 'కోవిడ్ సమయంలో శ్రీవిష్ణుకి ఈ కథ చెప్పాను. ఆయన వెంటనే ఓకే అన్నారు. శ్రీవిష్ణు నటించిన సినిమాలన్నీ చూశా. ఆయన బాడీ లాంగ్వేజ్, కామెడీ టైమింగ్ చాలా యూనిక్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఆయన పండించే హాస్యం మరో స్థాయిలో ఉంటుంది. వెన్నెల కిషోర్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటూ కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది' అని కార్తీక్ రాజు చెప్పారు. శ్రీవిష్ణు డబ్బింగ్ వల్ల ఈ సినిమాకు మరింత కామెడీ జత కలిసిందని, ఆయన సంభాషణా చాతుర్యం వల్ల స్క్రిప్ట్‌లో ఉన్న వినోదం మరింత ఎలివేట్ అయిందని అన్నారు. సంగీతం, నిర్మాణ విలువల గురించి మాట్లాడుతూ 'విశాల్‌చంద్రశేఖర్ కథానుగుణంగా మంచి పాటలిచ్చారు. గీతా ఆర్ట్స్ సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. దీనికి సీక్వెల్ చేసే ఆలోచన కూడా ఉంది. శ్రీవిష్ణు కోసం మరో మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి. ఆయనతో పనిచేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటా' అని కార్తీక్‌రాజు పేర్కొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.